క్లుప్తంగా

కాలనీలు పరిశుభ్రంగా ఉండాలి



వార్డులో పిచ్చిమొక్కల తొలగింపు

సుల్తానాబాద్: కాలనీలు శుభ్రంగా ఉంటేనే అంటురోగాలు దరిచేరవని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, కమిషనర్ రాజశేఖర్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఆరో వార్డులో గురువారం జేసీబీ సహకారంతో పిచ్చిమొక్కలను తొలగించారు. వర్షాకాలం కావడంతో పిచ్చిమొక్కలు పెరిగి పలురకాల పాములు వచ్చే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా కాలనీలను శుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్ తదితరులు ఉన్నారు.

బీఎస్పీతోనే బలహీనవర్గాలకు మేలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: సమాజంలోని బడుగు, బలహీనవర్గాల ప్రజలకు బహుజన సమాజ్ పార్టీతోనే మేలు కలుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లి మండలం మూలసాలలో గురువారం కొత్తగా నిర్మించిన గద్దెజెండా వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నరహరి, ఉదయ్, అవినాష్, పులిపాక లత, కాంపెల్లి కమల, కరుణ, అలేఖ్య, ఇందు, నేహ తదితరులను ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అవినీతి పెచ్చుమీరిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గట్టి గుణపాఠం చెప్పి బహుజనరాజ్యం సాధించుకుందామన్నారు. నాయకులు రవికుమార్, అరుణ, కిరణ్, రాము, సురేశ్, నరేశ్ ఉన్నారు.

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోండి

మంథని: జూలై 1న టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూపు–4 పరీక్షకు మంథని డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. మంథనిలో మూడు, పెద్దపల్లిలో 14, సెంటినరీకాలనీ జేఎన్‌టీయూ సెంటర్‌కు బస్సులు నడుస్తాయన్నారు. ఉదయం కరీంనగర్, పెద్దపల్లి నుంచి సెంటినరీకాలని మంథని వరకు పరీక్ష తర్వాత మంథని, సెంటినరీకాలనీ జేఎన్‌టీయూ నుంచి బస్సులు నడుస్తాయని తెలిపారు. అభ్యర్థులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా గౌస్



నియామక పత్రం అందిస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: కాంగ్రెస్ రామగుండం కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా మహ్మద్ గౌస్‌ను నియమించారు. ఈమేరకు గురువారం జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొంత రాజేష్, బుర్ల శ్రీనివాస్, ముస్తఫా, నజీముద్దీన్, కౌటం సతీశ్ పాల్గొన్నారు.

నీరుకుల్లకు డబుల్‌రోడ్డు పనులు ప్రారంభం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ నుంచి నీరుకుల్ల వరకు డబుల్‌రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఏడు కిలోమీటర్ల మేరకు రెండు ఫేస్‌లలో రూ.8.54కోట్ల నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.2.54కోట్లు, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.6కోట్ల నిధులు కేటాయించడంతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో కల్వర్టులు ఉండగా వెడల్పుగా నిర్మాణం చేపట్టారు. కానీ డీ86 కెనాల్ కాలువ కల్వర్టును మాత్రం మరిచి రోడ్డును నిర్మిస్తున్నారు. కెనాల్ కల్వర్టు ఇరుకుగా ఉండడంతో గతంలో ఇక్కడే ప్రమాదాలు ఎక్కువగా జరిగిన సంఘటనలు ఉన్నాయి. డబుల్‌రోడ్డుకు అనుగుణంగా కల్వర్టును సైతం నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

2న లాలపల్లిలో వనభోజనాలు

ఎలిగేడు: మండలంలోని లాలపల్లిలో జూలై 2న ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించనున్నట్లు రెడ్డిసంఘం గ్రామ అధ్యక్షుడు కొప్పెర తిరుపతిరెడ్డి తెలిపారు.

హరితహారానికి అంతా సిద్ధం

- 13 నర్సరీల్లో 1.30లక్షల మొక్కలు పంపిణీకి రెడీ
- ఇప్పటికే గుంతలు తీసి వర్షాల కోసం ఎదురుచూపులు
- గతంలో నాటిన మొక్కలకు రక్షణ కరువు



జూలపల్లి: నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

జూలపల్లి: మండలంలో హరిత విప్లవం తెచ్చేందుకు గ్రామాలను పచ్చని పల్లెలుగా మార్చేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని పంచాయతీల్లో హరితహారం 9వ విడత మొక్కలు నాటేందుకు గుంతలు తీసి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఒక్కో నర్సరీలో 10వేల చొప్పున 1.30లక్షల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. గ్రామాలను పచ్చని పల్లెలుగా మార్చేందుకు అధికారులు ఇప్పటికే ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టారు. ఇందుకు అనుగుణంగా ఎన్ఆర్ ఈజీఎస్ కూలీలతో గుంతలు తీయించారు. ఇటీవల నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో 19న హరితహారం ఆధ్వర్యంలో గ్రామానికో 15 మొక్కలు నాటి వదిలి పెట్టారు. వర్షాలు లేకపోవడమే దీనికి కారణమని అధికారులు చెప్పారు.

ఈజీఎస్ కూలీలకు ఉపాధి..

ఇప్పటికే ఉపాధిహామీ కూలీలతో గ్రామీణ నర్సరీలను పెంచిన అధికారులు కూలీలతో హరితహారంలో మొక్కలు పెట్టించి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. రోడ్ల వెంట, కాలువ గట్లపై, ప్రభుత్వ భూముల్లో గుంతలు తీసి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. గతంలో మండలవ్యాప్తంగా 8 విడతల్లో 7 నుంచి 8 లక్షల మొక్కలు నాటారు. కానీ నాటిన మొక్కలను సంరక్షించేందుకు ఎక్కువ కష్టపడాల్సి వస్తోంది. చాలా చోట్ల మొక్కలు రక్షణ లేదు. వీటి రక్షణకు ఈజీఎస్ ద్వారా నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ మొక్కలను మాత్రం చాలా చోట్ల పక్కనే ఉన్నవారు తీసి వేయగా, గొర్రెలు, మేకలు మేస్తున్నాయి.

కంచెలు ఏర్పాటు చేయాలి



మొక్కలను నాటిన తర్వాత వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలి. పశువులు మేయకుండా తగిన జాగ్రత్తలు పాటించి రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి. నాటిన మొక్కలకు పక్కనే ఉండే వారు కూడా కాపాడేందుకు తమవంతు కృషి చేయాలి.

– అమరగాని శ్రీనివాస్, ఉపాధికూలీ, జూలపల్లి

గుంతలు తీయించాం



గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఇప్పటికే గుంతలు తీయించాం. వర్షాలు పడితే వెంటనే మొక్కలు పెట్టేందుకు ఏర్పాట్లు చేశాం. దాదాపు 1.30 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. నాటిన తర్వాత మొక్కల రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– సదానందం, ఎన్ఆర్ఈజీఎస్, ఏపీవో

అసంపూర్తిగానే బతుకమ్మ ఘాట్



అసంపూర్తిగా బతుకమ్మ ఘాట్

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రిజర్వాయర్ కట్టపై ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేయడానికి జెడ్పీచైర్మన్ పుట్ట మధు రూ.42లక్షల నిధులు కేటాయించారు. గతేడాది బతుకమ్మ పండుగ వరకు పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం ఉండడంతో పనులు మధ్యలో నిలిపివేశారు. మళ్లీ పనులు చేపట్టకపోవడంతో పనులు నిలిచిపోయాయి. వర్షాకాలంలో రిజర్వాయర్‌లోకి నీరు చేరితే పనులు చేపట్టరాదని, వెంటనే పనులు పూర్తి చేయాలని సర్పంచ్ ఆకుల ఓదెలు ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఇప్పటివరకు వరకు పనులు ప్రారంభించలేదు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



సుల్తానాబాద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కమాన్‌పూర్: గుండారం మసీద్‌లో ప్రార్థనలు



ధర్మారం: ఈద్గా వద్ద ప్రార్థనలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఈద్గాలో గురువారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి అలింగనం చేసుకున్నారు.

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో బక్రీద్ పండును ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జూలపల్లి: శాంతి, ప్రేమ, త్యాగాలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రం, పెద్దాపూర్, వడ్కాపూర్ గ్రామాల్లోని మసీద్‌లలో ప్రార్థనలు చేసి ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్‌ను ఆయన ఫాంహౌస్‌లో కలవగా బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపి ఆయనను సన్మానించారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, జేకే శేఖర్‌యాదవ్, దాసరి ఉష ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎలిగేడు: ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట, ఎలిగేడు, ధూళికట్ట, లాలపల్లి, సుల్తాన్‌పూర్ తదితర గ్రామాల్లో గురువారం ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎలిగేడులోని మజీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఓదెల: మండలంలోని పొత్కపల్లి, కనగర్తి, గుంపుల, ఓదెల గ్రామాల్లోని ఈద్గా వద్ద ముస్లింలకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతోపాటు మడిపెల్లి, మొట్లపల్లి, కిష్టంపేట గ్రామాల్లో గురువారం ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలు నిర్వహించారు.

ధర్మారం: మండల కేంద్రంలోని ఈద్గా వద్ద గురువారం బక్రీద్ వేడుకలు నిర్వహించారు. ఎండీ హుస్సేన్, ఎండీ హఫీజ్, ఎండీ హమీద్, ఎండీ బాబా పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం

ఎలగేడు: మండలంలోని రాములపల్లికి చెందిన బత్తుల సోనియాకు పురిటినొప్పులు రావడంతో ఎలిగేడు మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించగా వైద్యసిబ్బంది ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాధారణ ప్రసవం చేశారు. సోనియా మగ బిడ్డకు జన్మనిచ్చింది. బాబు మూడు కిలోల బరువుతో సంపూర్ణ ఆరోగ్యంతోపాటు తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా తెలిపారు. స్టాఫ్‌నర్సు వీణారాణి, ఏఎన్ఎం అమృత, ఆశ కార్యకర్త ప్రేమలత, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మన్ ఉన్నారు.

✦ పెద్దమ్మ తల్లి బోనాలు

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీరాములపల్లిలో గురువారం రాత్రి పెద్దమ్మ తల్లి బోనాలు వైభవంగా నిర్వహించారు. బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి



మృతిచెందిన గేదె

పాలకుర్తి: మండలంలోని వేంనూర్ గ్రామ శివారులో గురువారం విద్యుత్‌షాక్‌తో గుమ్ముల లక్ష్మణ్‌కు చెందిన గేదె మృత్యువాతపడింది. గ్రామ శివారులో మేతకు వెళ్లిన గేదెకు తెగిపడిన 11కేవీ విద్యుత్ తీగలు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దాదాపు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు లక్ష్మణ్ తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు పరిహారం చెల్లించాలని బాధితుడు కోరాడు.

ఎన్టీపీసీ సీజీఎంకు సన్మానం



సన్మానిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన కేదార్ రంజన్ పాండును ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఉద్యోగ గుర్తింపు సంఘం ఐఎన్టీయూసీ అనుబంధ ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించారు. పరిపాలనా భవనంలోని ఆయన ఛాంబర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకటస్వామి, జనరల్ సెక్రటరీ కొలిపాక మల్లయ్య సీజీఎంకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో కందుల స్వామి, ఆరెపల్లి రాజేశ్వర్, సమ్మిరెడ్డి, ముత్యాల శ్రీనివాస్, సత్యనారాయణ, రాజనర్సయ్య, రాములు, ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్ పాల్గొన్నారు.

✦ నేడు పౌరహక్కుల దినోత్సవం

జూలపల్లి: మండలంలోని తేలుకుంట గ్రామం ఎస్సీ కాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ తహసీల్దారు అబూబకర్ తెలిపారు. సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించే దినోత్సవంలో అంటరానితనం, మూఢనమ్మకాలు, పౌరుల హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్, ఎంపీటీసీ శ్రీనివాస్ హాజరుకానున్నట్లు తెలిపారు.

✦ బుర్హాన్‌మియాపేటలో..

ఎలిగేడు: మండలంలోని బుర్హాన్‌మియాపేటలో శుక్రవారం ఉదయం 10.30గంటలకు సివిల్ రైట్స్‌డే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజమ్మ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని తహసీల్దార్ నాగరాజమ్మ కోరారు.

శ్రీకోదండ రామాలయంలో శ్రీహరి కీర్తనలు



శ్రీహరి కీర్తనలు చేస్తున్న భక్తులు

గోదావరిఖనిటౌన్: స్థానిక శ్రీకోదండ రామాలయంలో గురువారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 9 వరకు శ్రీహరి కీర్తనలు (భజన) కార్యక్రమం చేపట్టారు. తెల్లవారు జామునుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన ఆచార్యులు మధుసూదనాచార్యులు, శశిధర ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు



సుల్తానాబాద్ ఆలయంలో పూజలు



వేణుగోపాలస్వామి ఆలయంలో..

సుల్తానాబాద్: పట్టణంలోని ఆలయాల్లో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శివాలయం కమిటీ చైర్మన్ సత్యనారాయణ, వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళీధర్, పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పూజల్లో పాల్గొన్నారు. పూజారులు రమేశ్, మహేశ్, శ్రవణ్‌కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంతో పాటు మండలంలోని ఆలయాల్లో గురువారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శ్రీవేంకటేశ్వరస్వామి, కోదండరామాలయం, హనుమాన్, శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఎలిగేడు: ఎలిగేడు మండలంలోని 12 గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గ్రామాల్లో గురువారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గురువారం తొలి ఏకాదశి వేడుకలు ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

జూలపల్లి: శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్ మండల ప్రజలకు తొలి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సాయిచంద్ ఆకస్మిక మృతి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న నాయకులు

కమాన్‌పూర్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, ఉద్యమ గాయకుడు వీద సాయిచంద్ ఆకస్మిక మృతి రాష్ట్రానికి తీరని లోటు అని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అన్నారు. సాయిచందు మృతిపై కమాన్‌పూర్, రామగిరి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాలి అర్పించారు. పార్టీ కమాన్‌పూర్, రామగిరి మండలాల అధ్యక్షులు కిషన్‌రెడ్డి, రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్‌రావు, నాయకులు సత్యనారాయణగౌడ్, శంకరయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఫౌండేషన్ సభ్యులు

పాలకుర్తి: బసంత్‌నగర్‌లో ఆలయ ఫౌండేషన్, శంకర్ విజన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రామగుండం నియోజకవర్గ పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ ఫౌండేషన్ సభ్యులు పరికిపండ్ల రాము, మల్క రామస్వామి, పుప్పాల దయానందం, కుడిక్యాల సురేశ్ కోరారు. బసంత్‌నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బసంత్‌నగర్ వాసి, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి తన తండ్రి సత్యనారాయణ స్మారకార్థం శంకర్ విజన్ వారి సహకారంతో బసంత్‌నగర్‌లో నిర్మించిన కంటి ఆసుపత్రి ఆవరణలో జూలై 1, 2వ తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో అన్ని రకాల కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు వివరించారు.

అర్హులందరికీ గృహలక్ష్మి పథకం

ఎలిగేడు: బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం తీసుకుని రూ.3లక్షలు ఇవ్వడానికి సంబంధించిన జీవో విడుదల చేసి విధి విధానాలు ఖరారు చేసిన తర్వాత కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు 'ఇళ్లు మేము ఇస్తాం' అంటూ గ్రామాల్లో తిరుగుతున్నారని, ఆయన మాటలు నమొద్దని, అర్హులందరికీ గృహలక్ష్మి పథకం వర్తింప చేస్తుందని ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మొద్దని, అధికారంలో లేనివారు దరఖాస్తులు తీసుకోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 3వేల ఇళ్లు మంజూరు అని ప్రకటన రాగానే రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ నాయకులు తప్పుడు మాటలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అన్ని వర్గాల సంక్షేమ కోసం అహర్నిషలు కృషిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు వెన్నంటి ఉన్నారని, రానున్న ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు.

చిత్ర కథ



గుంతలమయంగా ప్రధాన రహదారి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం కొత్త గేట్ నుంచి 15 గ్రామాల వాహనదారులు ప్రయాణించే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా.. గుంతల్లో వర్షం నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. వర్షాలకు రోడ్డుపై వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.